క్లుప్తంగా

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ఈపూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈపూరు మండలంలోని అన్ని గ్రామాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, పందులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు జరుగుతుందని ఈపూరు పశువైద్యశాల ఏడీ డాక్టర్ పి.శ్రీనివాస మూర్తి సోమవారం తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది టీంలుగా ఏర్పడి గ్రామాల్లో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు పలు గ్రామాల్లో సుమారు 3 వేల పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి అపోహలు లేకుండా తమ పశువులకు టీకాలు వేయించుకొని సిబ్బందికి సహకరించాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఈపూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 6,11వ తరగతి ప్రవేశం కోసం, 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.జ్యోతి సోమవారం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని 24 కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి గాను 6, 11వ తరగతులలో ప్రవేశాలకు, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 27వతేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.శామ్యూల్ సోమవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే ప్రవేశాల కోసం పరిశీలింపబడతాయని స్పష్టం చేశారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. వివరాలకు 9000204930 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

జగనన్న గోరుముద్ద పథకం పరిశీలన

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని గ్రామసర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, ఇన్‌చార్జి సచివాలయ సంక్షేమ విద్యా సహాయకుడు వైఎస్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ

శావల్యాపురం: ఇటీవల కురిసిన అకాల వర్షం వలన ఉరుములు, మెరుపులు, పిడుగుపాటుకు మండలంలో పడిపోయిన విద్యుత్ స్తంభాలను తిరిగి పునరుద్ధరించినట్లు ఏఈ సంపెంగుల గాంధీ తెలిపారు. సోమవారం స్థానిక ఉప విద్యుత్ కేంద్రంలో ఏఈ మాట్లాడుతూ చినకంచర్ల, బాస్కర్ నగర్ గ్రామాల్లోని మాగాణి పొలాల్లో ఐదు విద్యుత్ స్తంభాలు పడిపోవటంతో పాటు, పింగాణి యంత్ర పరికరాలు పగలిపోయినట్లు చెప్పారు. దీంతో తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టి విద్యుత్ ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఆయనతో పాటు లైన్ ఇన్‌స్పెక్టరు శివకాంత్, లైన్‌మెన్ వెంకట్రావు ఉన్నారు.

నేడు ప్రజావేదిక కార్యక్రమం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు 15వ విడత ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నీ గ్రాపంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేసినటువంటి పనులు, నిధులు తదితర వాటిపై సామాజిక బృందాలు ఆడిట్ చేసిన వాటిని గ్రామసభలు నిర్వహించామన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

శావల్యాపురం: పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎ.రాజశేఖర్ సోమవారం పరిశీలించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రంలో 268 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు పరీక్షలు సజావుగా జరిగేలా పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర వసతులను స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషనులో ప్రశ్నపత్రాలను స్టాంగ్ రూంలో భద్రపరిచారు. ఆయనతో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరీ, డిపార్టుమెంటల్ అధికారి రామారావులు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆభరణాల వితరణ

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామం బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఆడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారికి రూ.లక్ష రూపాయల విలువ చేసే బంగారు నల్లపూసల తాడును చింతా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అందజేశారు.

మహిళాసాధికారతతోనే దేశాభివృద్ధి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: రాష్ట్రంలో మహిళలందరూ సర్వతోముఖాభివృద్ధి చెంది, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో నిలదొక్కుకోవాలని ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలను, చట్టాలను అమలు చేస్తున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం స్థానిక గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ గ్రామీణాభివృద్ధి పథకం మండల సమైఖ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ అసరా వారోత్సవాల బహిరంగసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డిఏ పీడీ బాలునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను ఉపయోగించుకుని పట్టుదలతో కష్టపడి పనిచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. జగనన్న అందించిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని మహిళలు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు.

మండల పరిధిలో డ్వాక్రా మహిళలకు 33.61 కోట్లు..

మండలంలో ఇప్పటికే 1229 గ్రూపుల డ్వాక్రా మహిళలకు 33.61 కోట్లరూ పాయలను రుణాల మాఫీ కింద రెండో విడతగా బ్యాంకు ఖాతాలకు



సభలో పాల్గొన్న మహిళలు

జమచేయడం ద్వారా జగనన్న సృష్టించిన నూతన అధ్యాయం అన్నారు. అలాగే స్త్రీనిధి ద్వారా మూడు కోట్లరూపాయలు రుణాలు అందించామన్నారు. గత టీడీపీ డ్వాక్రా రుణాలు రద్దు చేస్తున్నామని చెప్పి మహిళలను మోసం చేశారని, కానీ జగనన్న తాను ఇచ్చిన హామీలను ఒకటిన్నర సంవత్సరంలో నూటికి నూరుశాతం అమలు చేయడం ఒక చరిత్ర అన్నారు. అర్హులైన 35 లక్షల మంది మహిళలకు ఇళ్లస్థలాలు ఇచ్చి అక్కచెల్లెమ్మల పేరున రిజిస్ట్రేషన్ చేస్తానంటున్న జననేత జగనన్నకు ప్రతి మహిళ అండగా నిలవాలన్నారు. మహిళలే తమ ప్రభుత్వానికి బలం అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గం లో రూ.1400 కోట్లరూపాయలతో సంక్షేమం, మరో రూ.600 కోట్ల రూపాయలతో అభివృద్ధి ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఈ సందర్భంగా 33.61 కోట్లరూపాయల చెక్కును మహిళా ప్రతినిధులకు అందచేసి, వందమంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి జెడ్పీటీసీ కరుణకుమారి, జెడ్పీ కోఆప్షన్ మెంబరు షేక్ హష్మీ,మాజీ ఎంపీపీవెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు మండల సమైఖ్య అధ్యక్షురాలు జి.కుమారి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, అమరావతి, ధరణికోట, ఎండ్రాయి గ్రామ సర్పంచ్‌లు రాజేశ్వరి, మాదాసు పావని,నాయుడు రాంబాబు, అళ్ల శ్రీనివాసరెడ్డి అలా లక్ష్మీనారాయణ, నందూరి కరుణ కుమార్, చిలకా సాం బయ్య, ఎంపీడీఓ మాధురి,అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై శ్రద్ధ చూపాలి

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను రక్తహీనతతో బాధపడే వారికి పౌష్టికాహారం అందించి వారిని నిత్యం పర్యవేక్షిస్తూ రక్తహీనత నివారణ పై శ్రద్ధ చూపాలని పీహెచ్‌సీ వైద్యులు పి.జయకృష్ణప్రవీణ చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎనిమియా ముక్త్‌భారత్ లో భాగంగా ఎనిమిక్ మ్యాపింగ్ పై మండలస్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యులు జయకృష్ణప్రవీణ మాట్లాడుతూ దేశంలో రక్తహీనత లేకుండా చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా గ్రామస్థాయి రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించడం జరిగిందన్నారు. వారికి ప్రభుత్వం పౌష్టికాహారం, మందులను అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని వలంటీర్ల ద్వారా రోగులకు అందుతున్న సేవలపై నిత్యం పరిశీలిస్తూ ఉండా



సమావేశంలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు

లన్నారు. అధికారులు కూడా రోగులకు అందే ఆహారపదార్థాలపై ఆరా తీస్తుండాల్సిన అవసరం ఉందన్నారు. తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లి వారికి మెరుగైన వైద్యసేవలందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రూపవతి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎమ్‌లు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్స్ ట్రోఫి పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా కలెక్టర్స్ ట్రోఫీ సత్తెనపల్లి నియోజకవర్గ పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో సోమవారం జరిగాయి.సెలక్షన్ కమిటీ సభ్యులుగా బి.అనీల్ దత్త నాయక్, కోచ్ గంపా శ్రీను లు వ్యవహరించారు. ఎంపికయిన క్రీడాకారులు ఈ నెల 28, 29 తేదీల్లో నరసరావుపేటలో జరిగే జిల్లా స్థాయి కలెక్టర్స్ ట్రోఫీలో పాల్గొంటారని సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్ చార్జ్ లాకు పిచ్చయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోకా సోమనాథ్ , ప్రగతి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శివరామ కృష్ణ, యన్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఎంపికయిన క్రీడాకారులను సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్ చార్జ్ లాకు పిచ్చయ్య ప్రక



ఎంపికైన నియోజకవర్గ పురుషుల క్రికెట్ జట్టు

టించారు. యమ్.హరిబాబు (కెప్టెన్), షేక్.బాజి(వైస్ కెప్టెన్), యమ్.గురవయ్య, ఎం. నవీన్, ఎం. అశోక్, జి. వంశీ, వి.దుర్గా,పి.వంశీ,పీ.మూర్తి, సి.హెచ్. మహేంద్ర కుమార్, ఎం. ఆదినారాయణ పి. శివశంకర్, జె. నవీన్, బి. రాంబాబు, వై. చిరంజీవి, ఎస్. గోపీనాథ్‌లు ఎంపికయ్యారు.

సరస్వతీ నిలయం.. కేంద్రియ విద్యాలయం

- ఒకటో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

సత్తెనపల్లి: కేంద్రియ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రవేశాల ప్రక్రియ జూన్ 3వ తేదీ లోపు పూర్తి చేసేలా ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఉన్న కేంద్రియ విద్యాలయంలో ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు 360 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

గడువు వివరాలు.....

ఒకటో తరగతిలో ప్రవేశానికి మార్చి 27వ తేదీ నుంచి ఏప్రిల్ 17వ తేదీ రాత్రి 7 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉంటుంది. రెండవ తరగతి, ఇతర తరగతుల్లో ఖాళీలను ఏప్రిల్ 8 నుంచి 16 లోపు పూర్తి చేస్తారు. రెండో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 3 నుంచి 12వ తేదీ వరకు, మిగిలిన సీట్ల భర్తీని జూన్ 30వ తేదీ లోపు పూర్తి చేయనున్నారు.

మొదట వీరికి ప్రాధాన్యం...

– కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగంలో పని చేసే వారికి తొలి ప్రాధాన్యం ఉంటుంది. కేంద్ర అనుబంధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు తర్వాత ప్రాధాన్యం ఇస్తారు. వీరికి సీట్ల



సత్తెనపల్లిలోని కేంద్రియ విద్యాలయం ముఖద్వారం

కేటాయింపు జరిగిన తర్వాత మిగిలి ఉంటే స్థానికంగా నివాసం ఉండే వారికి అవకాశం ఉంటుంది.

– ఒకటో తరగతిలో ప్రవేశానికి మార్చినాటికి ఆరేళ్లు నిండి ఉండాలి. ఆరు నుంచి ఏడేళ్ల లోపు వారికే ప్రవేశం లభిస్తోంది.

సీట్లు ఇలా..

కేంద్రీయ విద్యాలయం లోని ఒకటో తరగతిని సత్తెనపల్లిలో ఒక సెక్షన్ గా కేటాయించారు. సెక్షన్‌కు 40 సీట్లను కేటాయించారు. ఈ సీట్లను కేటగిరీవారీగా భర్తీ చేయనున్నారు.

– జాతీయ విద్యా హక్కు చట్టం నిబంధన మేరకు 20 సీట్లను ఉచిత బోధన పద్ధతిలో భర్తీ చేస్తారు. 15 శాతం సీట్లు ఎస్సీలు, 7.5 శాతం సీట్లు ఎస్టీలు, మూడు శాతం దివ్యాంగులకు రిజర్వ్ అవుతాయి. మిగిలిన సీట్లు ఇతరులకు కేటాయిస్తారు. ఆన్‌లైన్‌లో లాటరీ ద్వారా ఎంపిక ఉంటుంది. ఒకటో తరగతిలో ఆర్‌టీఈ కింద ప్రవేశం పొందితే పాఠశాల చదువు పూర్తయ్యే వరకు ఉచిత బోధన లభిస్తుంది.

పంట నష్టం అంచనాలు నమోదు చేయండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన పంట పొలాలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. సోమవారం ఆయన మండలంలోని బలుసుపాడు, అమరావతి మండలాల్లోని నష్టపోయిన అరటి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ఆకాల వర్షాలతో నష్టపోయిన పైర్లను అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడి ప్రభుత్వ పరంగా అందే సాయం అందేలా చూసి ఆదుకుంటామన్నారు. వారి వెంట క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బచ్చు హనుమంతురావు, ఎంపీటీసీ ఉమామహేశ్వరరావులు ఉన్నారు.



బలుసుపాడులో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఈనెల 30వతేదీ వరకు పంటనష్టం నమోదు

నకరికల్లు: పంటనష్టాన్ని గ్రామస్థాయిలో అంచనా వేసి పూర్తిస్థాయి నివేదిక రూపొందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. అకాలవర్షానికి మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో సంభవించిన పంటనష్టాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట వివరాలు నమోదు చేసుకునేందుకు ఈనెల 30వతేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. 33 శాతం మించిన పంటనష్టం వాటిల్లిన పం



పంటనష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి దేవదాసు, సిబ్బంది

టపొలాలను గుర్తిస్తున్నామని అన్నారు. పంటనష్టం వాటిల్లిన రైతులు వివరాలను రైతుభరోసాకేంద్రంలో అందజేస్తే పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్, వీఆర్వో రామకృష్ణ, ఎంపీఈఓ కె.హనుమంతరావు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు, ఎమ్మెల్యే
- తిరునాళ్ల సందర్భంగా అకట్టుకున్న విద్యుత్ ప్రభలు

పెదకూరపాడు: చల్లంగా చూడమ్మా .. పోలేరమ్మ తల్లి అంటూ భక్త జనం గ్రామ దేవత పోలేరమ్మను వేడుకున్నారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో సుఖ, సంతోషాలతో నిండి ఉండాలని వేడుకున్నారు. ప్రతి ఏడాది ఉగాది తరువాత జరుపుకునే పోలేరమ్మ తిరునాళ్లకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, దూరప్రాంతాల నుంచి వచ్చే బంధువలతో గ్రామం కళకళడుతుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు గ్రామాన్ని , దేవాలయాని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు..

పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ గ్రామాలను చల్లంగా చూసే గ్రామదేవతను పూజించుకోవడం మన సంప్రదాయం అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు అందరూ సుఖశాంతులతో ఉండాలని వేడు



లగడపాడులో విద్యుత్ ప్రభ

కున్నట్లు తెలిపారు. వారి వెంట క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, పార్టీ నేతలు మైనేని నరేంద్రం, కోటేశ్వరరావు, బత్తుల రాజేంద్ర, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఖాశింషరీఫ్, గ్రామ సర్పంచ్ వేమవరపు నాగేశ్వరరావు, తహసీల్దార్ క్షమారాణి, ఎంపీడీఓ నరసింహరావు పాల్గొన్నారు. సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో ఎస్ఐలు కృష్ణారావు, సత్యనారయణలు బందోబస్త నిర్వహించారు.

సమాజ సేవకు వృత్తి అడ్డంకి కాదు

సత్తెనపల్లి: సమాజ సేవకు మనిషి హోదా, చేసే వృత్తి అడ్డంకి కాదని నిరూపించిన వ్యక్తి భరతమాత రూపశిల్పి దివ్వెల శ్రీనివాసరావు అని ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మిశివన్నారాయణ అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అసోసియేషన్ హాల్లో పెరుమాళ్ళ లక్ష్మి శివన్నారా యణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కాపుగంటి రత్తయ్య సంయుక్త ఆధ్వర్యంలో ఆ.ఓ.పా పట్టణ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి దివ్వెల శ్రీనివాసరావు ను సోమవారం ఘనంగా సన్మానించారు. కరోనా మొదటి విడతలో దాతల దాతృత్వముతో రూ. 2.25 లక్షలు వెచ్చించి నిత్యావసర సరుకుల పంపిణీ చేయడం, భరతమాత అన్నప్రసాద వితరణ పథకం దాతల దాతృత్వముతో ప్రారంభించి 500 రోజులు నిరుపేదలకు, వృద్ధులకు, యాచకులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేయటమే కాక, అనేకసార్లు స్వయంగా తానే ఆ వస్తువులు



దివ్వెలను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

మోసుకుని వచ్చి పంపిణీ చేయడం గొప్ప విషయం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు మద్ది వెంకటేశ్వరరావు, కోటా నాగ వరలక్ష్మి, రంగా రమాదేవి, దేవరశెట్టి రవికుమార్, మట్టా బాలాజీ, కోటా వెంకట బసవయ్య, చిలకల శ్రీనివాసరావు, పులికొండ శ్రీనివాసరావు, పోతుగంటి నరసింహ రావు, కాపుగంటి రమణ, పెరుమాళ్ళ మణి,బాలానాగు శివ తదితరులు ఉన్నారు.

పశువైద్యుల సలహాలను రైతులు పాటించాలి



గాలికుంటు వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: పశుపోషకులు, పాడి రైతులు పశు సంవర్ధకశాఖ అధికారుల సలహాలను నిరంతరం పాటించాలని ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాక్సిన్ల పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా తగిన సమయంలో వ్యాక్సిన్లను వేయించాలని తెలిపారు. అధికారుల సూచనలు పాటించడం ద్వారా పశువుల ఆరోగ్యంతో పాటు లాభదాయకమైన విషయాలను తెలుసుకోవచ్చన్నారు. రాజుపాలెం పశుసంవర్ధక శాఖ ఏడీఏ డా.జి.వీరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పశుసంవర్ధక సిబ్బంది వ్యాక్సిలన్ వేస్తారని, పశుపోషకులు తప్పనిసరిగా పశువులకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. నిత్యం పశు సంవర్ధక శాఖ క్యాంపులు నిర్వహించి రైతులను, పశుపోషకులను చైతన్యవంతం చేస్తున్నామన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

సత్తెనపల్లి: గ్లోబల్ స్టార్ రాంచరణ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఆదరణ వద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం రాంచరణ్ యువశక్తి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్నాడు రాంచరణ్ యువశక్తి అధ్యక్షుడు సిరిగిరి నరేంద్ర, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం, సిరిగిరి మణికంఠ,ఎస్‌కె గౌస్, రాయుడు బాలయ్య,ఎస్‌కె ఖాజా, అనిల్, మోహన్, పోతన, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలు

సత్తెనపల్లి: కలెక్టర్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలు డివిజన్ స్థాయిలో పట్టణంలోని శరభయ్యగుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఏడు గంటలకు జరుగుతాయని సత్తెనపల్లి ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంకొండ: మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ ఇమాంబీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివాహితురాలై ఉండాలని, స్థానికంగా నివాసం ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు వచ్చే నెల 3వ తేదీ సాయంత్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు అచ్చంపేటకు చెందిన దుద్దుడి సాగర్ (25) అరుంధతీనగర్‌లోని ఓ రూములో నివాసం ఉంటూ నగరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ రాత్రి తన రూములో ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దొడ్లేరులో పోలీసుల పల్లెనిద్ర

హాజరైన డీఎస్పీ, సీఐ

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి ఆదేశాలమేరకు క్రోసూరు పోలీసుల పల్లెనిద్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వీరాస్వామి, ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో శాంతి బద్రతలకు విఘాతం కలగకుండా, అసంఘిటిత కార్యక్రమాలు జరగకుండా పోలీసువారికి ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో ఎక్కడైనా అసంఘిటిత కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసిన యడల క్రోసూరు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

నాదెండ్ల: పాత కక్షల నేపధ్యంలో వ్యక్తిపై నలుగురు దాడి చేసిన సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన పూదోక పోలురాజు కుటుంబానికి సమీప బంధువులైన పూదోక రామారావు కుటుంబానికి పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదిన సాతులూరు గ్రామంలో జరిగిన తిరునాళ్ళలో ఘర్షణ పడ్డారు. 24న గ్రామంలో మరోసారి ఘర్షణకు దిగారు. పోలురాజుపై రామారావు, వెంకటస్వామి, గోపీ, వెంకయ్యలు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశారు.

చిన్నారులకు మంచి విద్యనందించాలి

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో గత నాలుగురోజులుగా జరుగుతున్న బాలల సంరక్షణ అనే కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ప్రిన్సి పల్ ఝాన్సీ వాణి మాట్లాడుతూ, బాలల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చిన్నారులకు మంచి చదువు అందించి వారు జీవితంలో ఉన్నతంగా రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కృషి చేయాలన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు రేవతి పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

నాదెండ్ల: అప్పాపురం-లింగంగుంట్ల మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది ఈఎంటీ అఖిల్, పైలట్ శ్యామ్ తెలిపిన వివరాల మేరకు అప్పాపురం గ్రామానికి చెందిన షేక్ నాగూర్, పి అలి, షేక్ మస్తాన్‌వలి తమ ద్విచక్రవాహనంపై రాత్రి 9.30 గంటల సమయంలో అప్పాపురం వెళ్తున్నారు. అదేసమయంలో నాదెండ్ల గ్రామానికి చెందిన పవన్ తన ద్విచక్రవాహనంపై స్పిన్నింగ్ మిల్లు వద్దకు వచ్చేసరికి ఇరు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నలుగురూ గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.